జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 175 | శుక్రవారం 21 నవంబర్– 2025 | పేజీలు : 4 | వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికి అవకాశం కలదు


ఎడిటర్ : 90520 45435

## ముఖ్యమంత్రిగా 10 వ సారి ప్రమాణస్వీకారం చేసిన నితీశ్ కుమార్...

### హాజరైన మోదీ, చంద్రబాబు

- పాట్నాలో జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమం
- నితీశ్‌తో పాటు 27 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం
- సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హాలకు ఉప ముఖ్యమంత్రి పదవులు





పాట్నా (సందేశం టైమ్స్) : జనతాదళ్ (యునైటెడ్) అధినేత నితీశ్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా పదోసారి ప్రమాణస్వీకారం చేసి రికార్డు సృష్టించారు. పాట్నాలోని గాంధీ మైదానంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు

మిగతాది 2లో

## ఆపరేషన్ సంభవ్ కొనసాగుతుంది..

### ఏపీ డీజీపీ స్పష్టం



అల్లూరి జిల్లా, (సందేశం టైమ్స్): ఏపీలో ఆపరేషన్ సంభవ్ సక్సెస్ అయ్యిందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అన్నారు. గురువారం ప్రత్యేక హెలికాప్టర్‌లో రంపచోడవరం చేరుకున్న డీజీపీ.. ఏవోబీ ప్రాంతంలో ఏరియల్ సర్వే చేశారు. ఆపై జిల్లాలోని మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన రెండు వరుస ఎన్ కౌంటర్లలో మావోయిస్టుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలను పరిశీలించారు. ఎకే 47 గన్స్, రైపిల్, పేలుడుకు ఉపయోగించిన వస్తువులను పరిశీలించారు.

2 లో

## వచ్చే వారం రా సీబీఐ కోర్టు ఆదేశం!



నాంపలి(సందేశం టైమ్స్): అక్రమాస్తుల కేసులో నాంపల్లి సీబీఐ కోర్టులో ఈరోజు హాజరైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విచారణ అనంతరం బెంగళూరుకు రిటర్న్ ఫ్లైట్ ఎక్కారు. కోర్టు ఆదేశాల మేరకు ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌కు చేరుకున్న జగన్, సుమారు 11.40 గంటలకు కోర్టులోకి ప్రవేశించారు. అయితే, కోర్టులో ఆయన గడిపిన సమయం కేవలం 25-30 నిమిషాలు మాత్రమే. జగన్ హాజరును న్యాయస్థానం రికార్డులో నమోదు చేసి, కోర్టు ఆదేశాల ప్రకారమే ఆయన విచారణకు హాజరైనట్లు స్పష్టం చేసింది. ఇక అక్రమాస్తుల కేసు విచారణ కొనసాగిస్తున్న సీబీఐ ప్రత్యేక కోర్టు, కేసును ఈ నెల 28వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో 2013 సెప్టెంబర్ నుంచి బెయిల్‌పై ఉన్న జగన్‌పై సీబీఐ ఇప్పటివరకు 11 ఛార్జిషీట్లు దాఖలు చేసింది.జగన్ కోర్టుకు రాగానే నాంపల్లి సీబీఐ కోర్టు వద్ద వైసీపీ శ్రేణులు భారీగా గుమికూడడంతో అక్కడ కొంతసేపు హంగామా చోటుచేసుకుంది. ఇదిలా ఉండగా, మధ్యాహ్నం 12:20 గంటలకు కోర్టు నుంచి బయటకు వచ్చిన జగన్, లోటస్‌పాండ్‌లోని తన నివాసానికి వెళ్లి కొద్దిసేపు గడిపారు. అనంతరం బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుండి ఆయన బెంగళూరుకు రిటర్న్ ఫ్లైట్ ఎక్కారు.

## కుప్పం ప్రజలకు అండగా ఉంటాం: నారా భువనేశ్వరి


### డీకే పల్లి చెరువుకు జల హారతి..

చిత్తూరు, (సందేశం టైమ్స్): కుప్పం నియోజకవర్గ ప్రజలకు తాము ఎల్లవేళలా అండగా ఉంటామని సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ భవన్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి భరోసా ఇచ్చారు. కుప్పంలో రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం శాంతిపురం లోని తన నివాసంలో నారా భువనేశ్వరి గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల నుంచి అర్జీలను ఆమె స్వీకరించారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో నారా భువనేశ్వరిని కలిశారు. స్వచ్ఛ భారత్ అవార్డులు గెలుచుకున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులను ఆమె అభినందించారు. దయాళ్ శ్రవణ్ ఫౌండేషన్ స్పాన్సర్ చేసిన వినికిడి పరికరాలను పంపిణీ చేశారు.

2 లో



## వైవీ సుబ్బారెడ్డిని ప్రశ్నిస్తున్న సిట్ అధికారులు



తిరుమల(సందేశం టైమ్స్): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడారన్న ఆరోపణలకు సంబంధించిన కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తును వేగవంతం చేసింది. ఇందులో భాగంగా, మాజీ టీటీడీ ఛైర్మన్, వైఎస్సార్సీపీ నాయకుడు వైవీ సుబ్బారెడ్డిని సిట్ అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఆయన విజయవాడకు రాలేనని చెప్పడంతో, సిట్ బృందం నేరుగా హైదరాబాద్‌లోని ఆయన నివాసంలోనే విచారణ చేపట్టింది

2 లో

## విరాళాల పేరిట మోసం..

## భక్తులను అప్రమత్తం చేసిన టీటీడీ

**మోసపూరిత సంస్థలకు విరాళాలు ఇవ్వొద్దని భక్తులకు టీటీడీ సూచన గ్లోబల్ హిందూ హెరిటేజ్, సేవ్ టెంపుల్స్ సంస్థలపై ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆరోపణలు తప్పుడు ప్రచారంతో విరాళాలు సేకరిస్తున్నాయని వెల్లడి అనుమానాస్పద సంస్థల వలలో పడొద్దని భక్తులకు విజ్ఞప్తి**

తిరుమల (సందేశం టైమ్స్): భక్తులను తప్పుదోవ పట్టించి విరాళా సేకరిస్తున్న కొన్ని సంస్థల పట్ల అప్రమత్తంగా ఉండాలని టీటీ ఛైర్మన్ బీఆర్ నాయుడు విజ్ఞప్తి చేశారు. గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ , సేవ్ టెంపుల్స్ డాట్ ఆర్గనైజేషన్ వంటి సంస్థలు మోసపూరిత చర్యలకు పాల్పడుతు న్నాయని ఆయన ఆరోపించారు. ఈ సంస్థలు తప్పుడు ప్రచారం చేస్తూ, భక్తుల మనోభావాలతో ఆడుకుంటూ విరాళాలు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నా యని నాయుడు పేర్కొన్నారు.

2 లో

## ఉద్యాన పంటల నష్టానికి రూ.4.82 కోట్లు విడుదల

అమరావతి,(సందేశం టైమ్స్): రాష్ట్రంలోని రైతులకు శుభవార్త! గత ఏడాది మే, అక్టోబరు నెలల్లో భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న ఉద్యాన పంటల నష్టానికి ప్రభుత్వం పెట్టుబడి రాయితీ కింద మొత్తం రూ. 4.82 కోట్ల నగదును విడుదల చేసింది. రాష్ట్ర విపత్తు నిబంధనల ప్రకారం, విడుదలైన ఈ నిధులలో, మే 2024లో నష్టపోయిన 2,856 మంది రైతులకు రూ. 4.32 కోట్లు, అలాగే అక్టోబరులో నష్టపోయిన 501 మంది రైతులకు రూ. 50.16 లక్షలు మంజూరు చేశారు. ఈ డబ్బులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి.

## తలసేమియా బాధితులకు అండగా ఉంటాం: మంచు మనోజ్



2 లో

కర్నూలు, (సందేశం టైమ్స్): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆవరణలో నందమూరి మోక్షజ్ఞ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో క్యాన్సర్, తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కర్నూలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హీరో మంచు మనోజ్, భూమా మౌనిక రెడ్డి దంపతులు హాజరయ్యారు. ఇందులో భాగంగా మంచు మనోజ్ రక్తదానం చేశారు.

## ముఖ్యమంత్రిగా 10వ సారి ప్రమాణస్వీకారం చేసిన నితీశ్ కుమార్... హాజరైన మోదీ, చంద్రబాబు

నాయుడు సహా పలువురు జాతీయ నేతలు హాజరయ్యారు. నితీశ్ కుమార్‌తో పాటు 27 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. బీజేపీ నేతలు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా ఉప ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టారు.ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు గాను, నితీశ్ కుమార్ నేతృత్వంలోని కూటమి ఏకంగా 202 సీట్లను కైవసం చేసుకుంది. ఇందులో బీజేపీ 89 స్థానాల్లో గెలుపొందగా, జేడీయూ 85 స్థానాల్లో విజయం సాధించింది. ఈ నేపథ్యంలో ఏర్పాటైన కొత్త మంత్రివర్గంలో బీజేపీ నుంచి 14 మందికి, జేడీయూ నుంచి 9 మందికి చోటు దక్కింది.నితీశ్ కుమార్ దాదాపు 19 ఏళ్లుగా బీహార్ ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతున్నారు. 2000 సంవత్సరంలో తొలిసారి సీఎంగా ఏడు రోజులు మాత్రమే పనిచేసిన ఆయన, ఇప్పుడు పదోసారి ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా నితీశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. "రాజకీయాల్లో ఎంతో అనుభవం, రాష్ట్రానికి మంచి పాలన అందించిన అద్భుతమైన రికార్డు నితీశ్‌కు ఉంది" అని ఆయన కొనియాడారు.

## ఆపరేషన్ సంభవ్ కొనసాగుతుంది.. ఏపీ డీజీపీ స్పష్టం

అనంతరం డీజీపీ మీడియాతో మాట్లాడుతూ.. మారేడుమిల్లిలో జరిగిన రెండు ఎన్ కౌంటర్లలో 13 మంది మావోయిస్టులు మృతి చెందారని తెలిపారు.50 మంది మావోయిస్టులను అరెస్ట్ చేశామన్నారు. ఈ ఏడాది జూన్‌లో రంపచోడవరంలో జరిగిన ఎన్ కౌంటర్‌లో లొంగిపోవాలని మావోయిస్టులను హెచ్చరించామని తెలిపారు. మావోయిస్టులు లేని ఏపీగా చేయాలనుకున్నామని వెల్లడించారు. ఆపరేషన్ సంభవ్ కొనసాగుతుందని డీజీపీ హరీష్ గుప్తా స్పష్టం చేశారు.

## తలసేమియా బాధితులకు అండగా ఉంటాం: మంచు మనోజ్

అనంతరం మనోజ్ మీడియాతో మాట్లాడుతూ.. అన్నయ్య బాలకృష్ణ అభిమానులు తమ్ముడు మోక్షజ్ఞ పేరుతో తలసేమియా బాధితుల కోసం రక్తదానం శిబిరం ఏర్పాటు చేయడం చాలా సంతోషమన్నారు. ఏమీ తెలియని వయసులో చిన్నారులు తలసేమియా వ్యాధితో బాధపడటాన్ని చూసి మనసు భారంగా మారిందని ఆవేదన చెందారు. తలసేమియా బాధితులకు 15 రోజులకు ఒకసారి రక్తం ఎక్కించాలని.. కొంతమంది పిల్లలు రక్తం అందక చనిపోతున్నారన్నారు. తలసేమియా బాధితులకు తాము అండగా ఉంటామని స్పష్టం చేశారు. టెర్రరిజమ్ ఒక సైడ్ నుంచే రాదని... అది ఎన్నో విధాలుగా వస్తుందన్నారు. డ్రగ్స్ వాడకం వల్ల ఆ డబ్బు టెర్రరిజానికి వెళ్తుందని.. డ్రగ్స్ నుంచి మన పిల్లలను కాపాడుకోవాలని మంచు మనోజ్ పేర్కొన్నారు.

## వైవీ సుబ్బారెడ్డిని ప్రశ్నిస్తున్న సిట్ అధికారులు

.గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో వైవీ సుబ్బారెడ్డి టీటీడీ ఛైర్మన్‌గా ఉన్నారు. ఆ సమయంలో లడ్డూల కోసం నెయ్యి సరఫరా చేసిన కంపెనీలు, వాటితో కుదుర్చుకున్న ఒప్పందాలు, ఛైర్మన్ హోదాలో తీసుకున్న నిర్ణయాలపై అధికారులు ప్రధానంగా సమాచారం సేకరిస్తున్నారు. ఈ కేసు విచారణలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయోనని రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

## కుప్పం ప్రజలకు అండగా ఉంటాం: నారా భువనేశ్వరి

అనంతరం డీకే పల్లి వద్ద కృష్ణా జలాలకు ఆమె జల హారతి ఇచ్చారు. అంతకు ముందు గంగమ్మ ఆలయంలో నారా భువనేశ్వరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణమ్మకు చీర సారె అందించడం తన పూర్వ జన్మ సుకృతమని ఆమె పేర్కొన్నారు. కుప్పంలో ఇలా శ్రీశైలం నుంచి వచ్చిన కృష్ణా జలాలను చూడడం తన జన్మలో మర్చిపోలేని అనుభూతిని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో మహిళలు తరలి వచ్చారు.

## విరాళాల పేరిట మోసం.. భక్తులను అప్రమత్తం చేసిన టీటీడీ

ఈ నెల 29న తిరుమల, తిరుపతి, తిరుచానూరు ప్రాంతాలను పుణ్యక్షేత్రాలుగా ప్రకటించేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈ సంస్థలు ప్రచారం చేస్తున్నాయని, ఇది పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. ఇలాంటి అనుమానాస్పద సంస్థలు చేసే ప్రచారాలను నమ్మవద్దని, వారి వలలో పడి విరాళాలు ఇచ్చి మోసపోవద్దని భక్తులకు ఆయన సూచించారు. భక్తులు అప్రమత్తంగా ఉండి, ఇలాంటి మోసపూరిత చర్యలను తిప్పికొట్టాలని టీటీడీ ఛైర్మన్ కోరారు.

## టీడీపీకి షాక్.. వైసీపీలోకి భారీగా చేరికలు

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్వతీపురం మన్యం జిల్లాలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సమక్షంలో నేడగల్లు గ్రామం నుంచి దాదాపు 250 కుటుంబాలు టీడీపీని వీడి వైసీపీలో చేరాయి. గతంలో తమ సొంత ఖర్చుతో పార్టీకి సేవలు అందించినా, గెలిచిన తర్వాత ఎమ్మెల్యే విజయ చంద్ర వ్యవహరిస్తున్న తీరు పట్ల విసుగు చెంది ఈ నిర్ణయం తీసుకున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు.

## జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన 2025-26 జిల్లా స్థాయి ఇన్స్పైర్ అవార్డుల ప్రదర్శన 2024-25 కార్యక్రమంలో పాల్గొన్న - శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి





(సందేశం టైమ్స్):సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 20నవంబర్ సంగారెడ్డి జిల్లా: నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని ఇ తక్షిల పాఠశాలలో ఈరోజు నారాయణఖేడ్ నియోజకవర్గ చరిత్రలోనే ఎప్పుడూ నిర్వహించనీ జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన 2025-26 జిల్లా స్థాయి ఇన్స్పైర్ అవార్డుల ప్రదర్శన 2024-25 ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి గారి ప్రత్యేక చొరవతో జిల్లా విద్యాధికారుల సాహకారంతో ఖేడ్ లో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ గత 2 రోజులుగా నిర్వహించగా ఈరోజుతో చివరి రోజు కాగా ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

అంజి రెడ్డి గ్రాడ్యువేషన్ ఎమ్మెల్సీ

అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను వీక్షించి విద్యార్థులతో మాట్లాడుతూ వారు ప్రదర్శించిన వైజ్ఞానిక ప్రదర్శన గురించి విద్యార్థులతో మాట్లాడుతూ వటి యొక్క ఉపయోగాలను విద్యార్థులతో ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు అలాగే సైన్స్ ఫెయిర్ లో మంచి ప్రదర్శనను కనబర్చిన విద్యార్థులను అభినందించి బహుమతులను ప్రదానం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో వారితోపాటు ఖేడ్ నియోజకవర్గనికి సంబంధించిన %వీజూ% లు మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు,ముఖ్య నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది

## కౌల్దార్లకు అన్నదాతా సుఖీభవ కోసం రాస్తారోకో



యద్దపాడు (పల్నాడు జిల్లా) :నవంబరు20(సందేశం టైమ్స్): కౌలురైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేల పెట్టుబడి సాయాన్ని ఒకేసారి జమ చేయాలని డిమాండ్ చేస్తూ కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో కౌల్దార్లు పల్నాడు జిల్లా యద్దపాడు మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ రెండో విడత జమ సందర్భంగానైనా కౌలురైతులకు పెట్టుబడి సాయం జమ చేయకపోవడం దారుణమన్నారు. మొదటి విడతలోనూ విస్మరించారని, అక్టోబరులో జమచేస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. వాస్తవానికి పెట్టుబడులు సమకూర్చుకుని వ్యవసాయం చేస్తున్న కౌల్దార్లకే పథకాన్ని వరింపజేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం దుర్మార్గమైన చట్టాన్ని తెచ్చి కౌలు రైతులకు అన్యాయం చేసిందని, ఒసి కౌలు రైతులకు రైతు భరోసాను ఇవ్వలేదని టిడిపి, జనసేన నాయకులు విమర్శించారని గుర్తు చేశారు. ఒసి రైతులతోపాటు అన్ని సామాజిక తరగతుల్లోని కౌలురైతులకు పెట్టుబడి సహాయం కింద ఇచ్చే అన్నదాత సుఖీభవ రూ.20 వేలను ఇస్తామని సూపర్ సిక్స్‌లో చెప్పి ఇప్పుడు మోసం చేయడం తగదన్నారు. కొత్త చట్టం తెస్తున్నానని అసెంబ్లీలో ప్రకటించినా చట్టం తేలేదని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం భూస్వాములకు లొంగిపోయిందని, దీనిపై కౌల్దార్లు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేయాలని పిలుపునిచ్చారు.

## నాటుసారా తయారీపై నిఘా పెట్టాలి

నవంబరు20(సందేశం టైమ్స్):జంగారెడ్డిగూడెం నాటుసారా తయారీ, విక్రయంపై గట్టి నిఘా పెట్టాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అసిస్టెంట్ కమిషనర్ కెవి.నాగప్రభుకుమార్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన జంగారెడ్డిగూడెం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి సుంకం చెల్లించని మద్యం రవాణాను కట్టడి చేయాలని సిబ్బందికి స్పష్టమైన సూచనలు ఇచ్చారు. అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం, పోలవరం పరిధిలోని అన్ని మద్యం షాపుల్లో ఎక్సైజ్ సురక్ష మొబైల్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించే చర్యలు పూర్తయ్యాయని, ఇకపై మద్యం అమ్మకాలు పూర్తిగా స్కాన్ విధానంలోనే నిర్వహించాలని ఆదేశించారు. యాప్ వినియోగంపై ఎక్సైజ్ సిబ్బంది నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నారని, స్కాన్ విధానం అమలు చేయని షాపులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనుబాబు, పోలవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వీరబ్రహ్మం, సిబ్బంది పాల్గొన్నారు.



## అధిక గిరాకీ పంటలపై దృష్టి పెట్టాలి



సాలూరు :నవంబరు20(సందేశం టైమ్స్): రైతులు కేవలం సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, మార్కెట్‌లో అధిక గిరాకీ, లాభాలు ఉండే పంటల సాగుపై దృష్టి పెట్టాలని కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సాలూరు మండలం పెదబోరబందలో రైతులు వేసిన పత్తి పంటను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పత్తితో పాటు ఇతర వాణిజ్య పంటలు, ఉద్యాన పంటల సాగును పెంచడం ద్వారా ఆదాయాన్ని రెట్టింపు చేసుకోవచ్చని అన్నారు. అధునాతన సాగు పద్ధతులు, సాంకేతికత, నూతన వంగడాల ఎంపిక, నాణ్యమైన విత్తనాల వినియోగం తప్పనిసరి అని సూచించారు. మెరుగైన దిగుబడులు సాధించడానికి పాటించాల్సిన ఆధునిక సాగు పద్ధతుల గురించి వ్యవసాయాధికారుల నుంచి సలహాలు తీసుకోవాలని తెలిపారు. పంటలకు వచ్చే తెగుళ్ళను గుర్తించి, సమయానికి సరైన మందులు వినియోగించడంపై అవగాహన కల్పించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా, పంటల బీమా, వడ్డీ లేని రుణాలు వంటి పథకాల గురించి వివరించారు. ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా బలపడాలని సూచించారు. పత్తికి మంచి ధర రావాలంటే, తడి లేకుండా, శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, నాణ్యత విషయంలో జాగ్రత్తగా ఉండాలని కోరారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు గ్రామాల స్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేసి, రైతులకు క్షేత్ర స్థాయిలో సలహాలు, సూచనలు అందించాలని, రైతులకు ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అధిక దిగుబడులు సాధించి, జిల్లాను వ్యవసాయ రంగంలో ముందుంచాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

# ప్రభుత్వ హాస్పిటళ్లలో వృద్ధులకు ప్రత్యేక వైద్య సేవలు

## జెరియాట్రిక్ సేవలు విస్తరించాలని సూచించిన మంత్రి దామోదర్



సందేశం టైమ్స్: నారాయణాఖేడ్ ఇంచార్జి నవంబర్ 20 అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వృద్ధుల వివరాలతో జాబితాలు సిద్ధం చేసుకోవాలని డీఎంహెచ్‌వోలకు సూచన దేశంలో.. రాష్ట్రంలో పెరుగుతున్న వృద్ధుల జనాభాకు అనుగుణంగా వారికి అవసరమైన వైద్య సేవలను కూడా విస్తరిస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. అన్ని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్స్‌లో జెరియాట్రిక్ సేవలు అందించాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు మంత్రి సూచించారు. ఈ మేరకు జనరల్ హాస్పిటళ్ల సూపరింటెండెంట్లు, అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలు, ప్రోగ్రామ్ ఆఫీసర్లతో మంత్రి బుధవారం సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఇనిస్టిట్యూట్‌లో జరిగిన ఈ సమీక్షలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, డీహెచ్ రవిందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ మాట్లాడుతూ.. జీవన ప్రమాణాలు పెరిగాయని, దీంతో వృద్ధుల సంఖ్య కూడా పెరుగుతున్నదన్నారు. పిల్లల కోసం మనం ప్రత్యేకంగా చైల్డ్ హెల్త్ కేర్ సెంటర్లు నిర్వహిస్తున్నట్టుగానే, జపాన్, ఇటలీ తరహాలో వృద్ధుల కోసం ప్రత్యేక హాస్పిటళ్లు నిర్వహించాల్సిన అవసరం భవిష్యత్తులో మన దేశంలోనూ ఏర్పడుతుందన్నారు. వృద్ధాప్యంలో వచ్చే మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకుని అన్ని హాస్పిటళ్లలోనూ జెరియాట్రిక్ సేవలను విస్తరించాలని మంత్రి సూచించారు. ప్రతి జీజీహెచ్, డిస్ట్రిక్ట్ హాస్పిటల్‌లో ఇప్పటికే జెరియాట్రిక్ వార్డులు ఏర్పాటు చేశామన్న విషయాన్ని ప్రజలకు తెలిసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.



అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వృద్ధుల జాబితాలు సిద్ధం చేసుకుని, వారికి ప్రభుత్వ హాస్పిటళ్లలో ఉచిత వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత డీఎంహెచ్‌వోలదేనని మంత్రి ఆదేశించారు.

### డీఎంహెచ్‌వోలు, సూపరింటెండెంట్ల అటెండెన్స్‌ను మేము మానిటర్ చేస్తున్నాం.

గత ప్రభుత్వం తరహాలో హాస్పిటల్, మెడికల్ కాలేజీ పేరిట అరకొర బిల్డింగులు కట్టి వదిలేయడం లేదు. ప్రతి హాస్పిటల్‌లోనూ అవసరమైనమేర డాక్టర్లను, నర్సులను, ఇతర సిబ్బందిని నియమిస్తున్నాం. ఈ రెండేళ్లలో 9 వేలకుపైగా పోస్టులను భర్తీ చేశాం.. మరో 7 వేలకుపైగా పోస్టులు భర్తీ అవుతున్నాయి. మ్యాన్ పవర్‌తో పాటు మీరు అడిగిన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఇక మీ దగ్గరకు వచ్చే పేషెంట్లకు సర్వీస్ చేయడం మీ చేతుల్లోని ఉంది. ప్రభుత్వ హాస్పిటళ్లు మీవి మీరు వాటిని ఓన్ చేసుకుని కాపాడుకోవాలి.. అక్కడికి వచ్చే పేషెంట్లకు మంచి సర్వీస్ అందించి రక్షించుకోవాలి. డీఎంహెచ్‌వోలు, హాస్పిటల్ సూపరింటెండెంట్ల అటెండెన్స్‌ను మేము మానిటర్ చేస్తున్నాం. మీ సిబ్బంది అటెండెన్స్‌ను మీరు మానిటర్ చేస్తున్నారో లేదో కూడా చేస్తున్నాం. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు. ఎంతటివారిపైన అయినా కఠిన చర్యలు తీసుకుంటాం. అదే సమయంలో మంచిగా పని చేసే వారికి అండగా నిలుస్తాం. హాస్పిటళ్లలో పాతుకుపోయి, పని చేయించే ఆఫీసర్లపై తప్పుడు ఆరోపణలు చేస్తూ, వార్తలు రాయించడం వంటి చర్యలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరిద్దాం. వారి వివరాలను మీ హెచ్‌ఓడీలకు అందించండి. మీరు చేసిన పర్యటనలు, తనిఖీలు, ఫైండింగ్స్, యాక్షన్ టేకెన్ రిపోర్టులను ప్రతి నెలా అందించాలి.“మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మన వైద్య వ్యవస్థ కూడా మారాలి.. మార్చే ప్రయత్నం చేద్దాం. ఒకప్పుడు కమ్యునికెబుల్ డిసీజెస్ ఎక్కువగా ఉండేవి.. ఇప్పుడు నాన్ కమ్యునికెబుల్ డిసీజెస్.. లైఫ్‌స్టైల్ డిసీజెస్ ఎక్కువయ్యాయి. మన హాస్పిటళ్లను కూడా బీపీ, షుగర్, కేన్సర్, గుండె, కిడ్నీ జబ్బులు లైఫ్‌స్టైల్ డిసీజ్‌లకు మెరుగైన ట్రీట్‌మెంట్ అందించే విధంగా తయారు చేసుకుంటున్నాం. అన్ని జిల్లాల్లో ఎన్‌సీడీ క్లినిక్‌లు ప్రారంభించుకున్నాం.డే కేర్ కేన్సర్ సెంటర్లు పెట్టుకున్నాం.ఐవీఎఫ్ సెంటర్లు ఏర్పాటు చేసుకున్నాం.ఇప్పుడు జెరియాట్రిక్ సేవలు విస్తరించుకుంటున్నాం.భవుష్యత్తులో ఈ సేవలన్నింటినీ మరింత విస్తరించుకుంటూ ప్రజలకు ప్రభుత్వ హాస్పిటళ్లలోనే మెరుగైన వైద్య సేవలు అందిద్దాం.

### "పేషెంట్లను దోచుకునే హాస్పిటళ్లపై కఠిన చర్యలు తీసుకోండి

ట్రీట్‌మెంట్ పేరిట ప్రజలను దోచుకునే ప్రైవేట్ హాస్పిటళ్లపై కఠినంగా వ్యవహరించండి. ఐవీఎఫ్ సెంటర్లు, పెయిన్ క్లినిక్‌లు, రిహాబిలిటేషన్ సెంటర్ల పేరిట దోపిడీకి, అవకతవకలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరించండి. మెడికల్ ఎడ్యుకేషన్, వైద్య విధాన పరిషత్, పబ్లిక్ హెల్త్, ఎన్‌హెచ్‌ఎం డిపార్ట్‌మెంట్ల నడుమ కోఆర్డినేషన్ ఉండాలి. ఎక్కడికి అక్కడ సమన్వయ కమిటీలను నియమించుకుని పని చేయండి. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ పకడ్బంధీగా అమలు చేయాలి. పోలీసులను చూడగానే నేరస్తులు భయపడినట్టు, మిమ్మల్ని చూస్తే నిబంధనలు ఉల్లంఘించే హాస్పిటళ్ల యాజమాన్యాలు భయపడాలి.కొన్ని జిల్లాల్లో సిజేరియన్ డెలువరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. వాటిని తగ్గించి నార్మల్ డెలివరీలను ప్రోత్సహించండి. సిజేరియన్ డెలివరీలు మాత్రమే చేస్తున్న ప్రైవేట్ హాస్పిటళ్లపై దృష్టి సారించండి.”””“ప్రభుత్వ హాస్పిటల్స్ నుంచి పేషెంట్లను బయటకు రిఫర్ చేయొద్దని మంత్రి అన్నారు. సబ్ సెంటర్ నుంచి జీజీహెచ్ల వరకూ అన్ని హాస్పిటళ్ల నడుమ సమన్వయం ఉండాలని ఆయన సూచించారు. ప్రభుత్వ హాస్పిటల్‌కు వచ్చిన పేషెంట్‌ను అవసరమైనప్పుడు మరో ప్రభుత్వ హాస్పిటల్‌కు మాత్రమే రిఫర్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లోనే అవసరమైన అన్నిరకాల వైద్య సేవలుఅందించాలన్నారు.

## భీక్యా థండా PM SHRI పాఠశాలలో

## 72 రోజుల ఆడపిల్లల సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ ప్రారంభం





(సందేశం టైమ్స్ ) ప్రతినిధి భీక్యా థండా, కోదాడ మండలం (సూర్యాపేట జిల్లా), నవంబర్ 20,2025. తెలంగాణ ప్రభుత్వం ఆడపిల్లల భద్రత కోసం రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న 72 రోజుల ప్రత్యేక ‘సెల్ఫ్ డిఫెన్స్’ శిక్షణ కార్యక్రమం భాగంగా, PM SHRI M.P.U.P.S., భీక్యా థండా పాఠశాలలో ఈరోజు శిక్షణా తరగతుల మొదటి రోజు ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజశేఖర్ సార్, M. సైదారావు సార్, కే. శివరామకృష్ణ రెడ్డి సార్, రిచర్డ్ హల్వర్సన్ సార్ పాల్గొని, ఆడపిల్లల భద్రత కోసం స్వీయ రక్షణ నైపుణ్యాలు ఎంత ముఖ్యమో వివరిస్తూ విద్యార్థులను ప్రోత్సహించారు.సూర్యాపేట జిల్లా మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కరాటే మాస్టర్ శెట్టి వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో శిక్షణ మొదలయ్యింది.

**శిక్షణలో భాగంగా:**

**ఆత్మరక్షణ పద్ధతులు**

**ప్రమాద పరిస్థితుల్లో ఎలా స్పందించాలి**

**కరాటే ప్రాథమిక టెక్నిక్స్**

**రోజువారీ 1 గంట ప్రాక్టికల్ క్లాసులు**

**ఆడపిల్లల్లో ధైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించే ప్రత్యేక వ్యాయామాలు**

**విద్యార్థులకు ప్రాక్టికల్ డెమోన్స్ట్రేషన్లు ఇచ్చారు.**

తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వం పాఠశాలల్లో బాలికలకు 72 రోజులపాటు సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణను తప్పనిసరిగా అమలు చేస్తోంది. ఈ శిక్షణ ద్వారా ఆడపిల్లలు భవిష్యత్తులో ఏ పరిస్థితినైనా ధైర్యంగా ఎదుర్కొనే నైపుణ్యాలు పొందుతారని అధికారులు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, కోచ్‌లు కలిసి ఈ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా ప్రారంభించారు. భీక్యా థండా PM SHRI పాఠశాలలో మొదలైన ఈ కార్యక్రమం కోదాడ మండలంలోని ఇతర పాఠశాలలకు ఒక ఆదర్శంగానిలుస్తోంది.

## రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసము ప్రారంభించిన అమ్మ ఒడి వాహనాన్ని ప్రతి ఒక్కరు సదివినయోగం చేసుకోవాలని

## 102 జిల్లా కోఆర్డినేటర్ ఇమామ్ పాషా


(సందేశం టైమ్స్ )అనంతగిరి నవంబర్ 20 సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల పరిధిలోని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమ్మ ఒడి వాహనాన్ని జిల్లా కోఆర్డినేటర్ షేక్ ఇమామ్ పాషా మరియు ప్రోగ్రామ్ మేనేజర్ సలీం తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సామజిక ఆరోగ్యకేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్బంగ అయన మాట్లాడుతూ 102 వాహనాన్ని గర్భిణీలు డెలివరీ కంటే ముందు అస్పత్రిలో చెకప్ కోసం అలాగే నెల వారి టీకాలకోసం,డెలివరీ తర్వాత సురక్షితముగా ఇంటికి చేర్చేందుకు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మి ప్రసన్న మరియు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## అనురాగ్ ఇంజనీరింగ్ కాలేజీలో ఘనంగా

## జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు





(సందేశం టైమ్స్ ) 20-11-2025 అనంతగిరి నవంబర్ 20 అనురాగ్ ఇంజనీరింగ్ కాలేజీలో ఘనంగా జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమమం కోదాడలో అనురాగ్ ఇంజనీరింగ్ కాలేజీలో నేటి తో జాతీయగ్రంధాలయా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిధిగా కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీ డాక్టర్. సురేష్కుమార్ గారు , కాలేజీ వైస్ ప్రెసిడెంట్ శ్రీ కే. జైపాల్రెడ్డిగారు , ఎస్టాబ్లిషమెంట్ ఆఫీసర్ శ్రీ కే. కొరుప్రోలు పాండురంగప్రసాద్ గారు అకౌంటెంట్ శ్రీ ఎం భూపతిరావు గారు హాజరు అన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చెసి గ్రంధాలయ శాస్త్ర పితామహుడు శ్రీ డ్. డాక్టర్ స్. ర్. రంగనాథం గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా నిర్వహించిన క్విజ్ వక్తృత్వ , వ్యాస రచన , బుక్ ఆన్ స్పాట్ రివేయు , లైబ్రరీ బెస్ట్ యూసర్ అవార్డ్స్ విభాగాలలో విజేతలుగా భండారు గీతిక ప్. దుర్గాభవాని, వైష్ణవీదేవి జ్. ఉపేంద్రమ్మ కు, ఈటిక శ్రీజ , ఆ. శ్రీచందన శ్రీమయి , లావణ్యవర్మ అమీషా హిమబిందు చరణ్ కావ్య , ధనుసై లకు బహుమతులను అందించారు. ప్రిన్సిపాల్ గారు మాట్లాడుతూ గ్రంథాలయాల ఆవశ్యకత మరియు ఉపయోగాలు వివరించారు. మనదేశ స్వతంత్ర పోరాటంలో గ్రంథాలయాల పాత్ర ముఖ్యమైనది అన్నారు. ఆలోచనల అక్షర రూపము ఒక మంచి పుస్తకం అన్నారు. మరియు ఇది శాశ్వతం అన్నారుఈ కార్యక్రమంలో వివిధ విభాగ అధిపతులు భోధన మరియు బోధనేత్ర సిబ్బంది , ఇంజనీరింగ్, డిప్లొమా మానేజ్మెంట్ సైన్స్ విద్యార్థిని ,విద్యార్థులు పాల్గొన్నారు . ఈకార్యక్రమాన్ని లైబ్రరీనే శ్రీ డాక్టర్ జి. సాయిప్రసాద్ గారు మరియు గ్రంధాలయ సిబ్బంది పర్యవేక్షించారు.

## “నూతన ఎంపీడీవోకి ఘనసన్మానం”

(సందేశం టైమ్స్ ) సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 20 నవంబర్, సంగారెడ్డి జిల్లా వట్టపల్లి మండలానికి నూతనంగా నియమితులైన ఎంపీడీవో శ్రీ సాయి తరుణ్‌కు ఘనసన్మానం నిర్వహించారు.“వట్టపల్లి మండల అభివృద్ధి దిశగా కొత్త ఎంపీడీవో శ్రీ సాయి తరుణ్ చేపట్టబోయే కార్యక్రమాలకు మా పూర్తి మద్దతు ఉంటుంది. ఆయనకు ఈ రోజు శాలువా కప్పి మా అభినందనలు తెలియజేయడం సంతోషంగా ఉంది,” అని ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు తెలిపారు.ఈ సందర్భంగా వట్టపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేష్ జ్యోష్ మాట్లాడుతూ,“మండల పరిపాలన మరింత చురుగ్గా సాగేందుకు కొత్త ఎంపీడీవో రాక అనుకూలంగా ఉంటుంది” అని పేర్కొన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దిగంబర్, విట్టల్‌రావు, అశోక్ గౌడ్, అభిబ్ మీయా తదితరులుపాల్గొన్నారు.





ఆత్మ కమిటీ చైర్మన్ కాచూరు రావు

వట్టపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు

# యాసిడ్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు..



మహబూబ్‌నగర్:నవంబరు20(సందేశం టైమ్స్): మహబూబ్‌నగర్‌లో ఘోర రోడ్డు ప్రమాద ఘటన చోటుచేసుకుంది. జడ్చర్ల మండలం మాచారం వద్ద 44వ జాతీయ రహదారిపై యాసిడ్ ట్యాంకర్‌ను ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదం కారణంగా ట్యాంకర్ నుంచి పొగలు బయటకు వచ్చాయి. వెంటనే స్పందించిన అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పొగలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో, పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన జరిగిన సమయంలో బస్సులో 26 మంది ప్రయాణికులు ఉన్నట్టు తెలిసింది. ట్రావెల్స్ బస్సు చిత్తూరు నుండి హైదరాబాద్‌కు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఎవరూ మృతి చెందకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# గుడ్డు ధర వెరీ బ్యాడ్...




ఉట్నూర్(ఆదిలాబాద్):నవంబరు20(సందేశం టైమ్స్): గుడ్డు వెరి గుడ్ అనేవారు కానీ.. కోడిగుడ్డు ధరలు పెరుగుతున్న విధానం చూస్తుంటే వెరీ బ్యాడ్ అనుకుంటున్నారు. మాంసాహారం భుజించలేని సామాన్యులకు గుడ్లు అందుబాటులో ఉండేవి. కానీ గుడ్డు ధర ఉన్నట్టు ఉండి అమాంతంగా పెరిగి పోతుండడంతో చికెన్ ధరలకు చేరుకుంటుంది. జిల్లాలో కోడిగుడ్డు రిటైల్ ధర గత కొన్ని రోజుల కింద రూ.5 నుంచి రూ.6.50 వరకు ఉండగా ప్రస్తుతం మార్కెట్‌లో గుడ్డు ధర రూ.8కి చేరిపోయింది.గత వర్షాకాలంలో కనివిని ఎరుగని రీతిలో వర్షాలు కురిశాయి. కురిసిన అతివృష్టితో కూరగాయలు అంతంత మాత్రమే అందుబాటులోకి వస్తుండడంతో కూరగాయ ల ధరలు భారీగా పెరుగుతున్నాయి. కిలో టమోటా రూ.50కాగా వంకాయలు కిలో రూ.120, బీరకాయలు రూ.100, దొండకాయలు కిలో రూ.80, సోరకోయలు ఒక్కొటి రూ.30 నుంచి రూ.50కి, ఆకుకూరలు ఒక కట్ట రూ.20 నుంచి రూ. 30కి విక్రయిస్తున్నారు. కూరగాయల ధరలతో సమానంగా కోడిగుడ్డు ధర పెరగడంతో సామాన్యుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. శాకాహారం తినాలన్న ఆకాంక్షను తగ్గించుకోవడంతో పాటు గుడ్డు ధర కూడా పెరిగి పోవడంతో చికెన్ కొనుక్కుంటే మేలని ప్రజలు భావిస్తున్నారు.

# అదనపు ఆదాయంపై ఆర్టీసీ దృష్టి

**బస్సులు, టికెట్లపైనా వాణిజ్య ప్రకటనలు**

**ప్రస్తుతం అమల్లో ఉన్న కాంట్రాక్టు విధానానికి స్వస్తి**

**యాడ్ ఏజెన్సీల నుంచి ప్రకటనల స్వీకరణకు కసరత్తు**



హైదరాబాద్, నవంబరు20(సందేశం టైమ్స్): అదనపు ఆదాయం సమకూర్చుకోవడంపై ఆర్టీసీ దృష్టి సారించింది. ఇప్పటికే బస్సు సీట్లు, సిటీ బస్సుల్లో హ్యాండిల్లపై ప్రకటనలు ఇస్తుండగా.. కొత్తగా బస్సుల బయటి వైపు ప్రకటనలతో ఆదాయం పొందేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం అనుసరిస్తున్న కాంట్రాక్టు పద్ధతిలో ప్రకటనలకు సంబంధించిన మొత్తాలను ఆయా సంస్థలు సకాలంలో ఆర్టీసీకి చెల్లించడం లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని యాడ్ ఏజెన్సీల నుంచి ప్రకటనలు స్వీకరించాలని అధికారులు భావిస్తున్నారు. ఆయా ప్రకటనలకు సంబంధించిన మొత్తాన్ని ముందుగానే తీసుకొని, సదరు యాడ్ ఏజెన్సీకి కమీషన్ చెల్లించాలని యోచిస్తున్నారు. ఈ మేరకు బస్సుల బయటి వైపు ప్రకటన బోర్డుల ఏర్పాటుకు సంబంధించిన నమూనాను సంస్థ ఎండీ వై.నాగిరెడ్డి బస్‌భవన్‌లో బుధవారం పరిశీలించారు. అలాగే, బస్సుల్లో ఇస్తున్న టికెట్ వెనుక భాగంపైనా ప్రకటనలు ముద్రించడం ద్వారా అదనపు ఆదాయం సమకూర్చుకోవాలని భావిస్తున్నారు. మరోవైపు.. దూర ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సుల్లోని ప్రయాణికులు భోజనం, టిఫిన్ చేసేందుకు ఆయా మార్గాల్లోని దాబాలు, హోటళ్ల వద్ద ఆపుతున్న విషయం తెలిసిందే. ఆయా హోటళ్లు, దాబాల నుంచి గుడ్ విల్ పొందే విషయంపైనా సమాలోచనలు చేస్తున్నారు. ఎంపిక చేసిన దాబాలు, హోటళ్లలో ఆహారం నాణ్యత, శుచి, శుభ్రత వంటి అంశాలను అధికారుల బృందం పరిశీలించి, అంతా ఓకే అనుకున్న తర్వాత వారితో ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉంది. కాగా, సోషల్ మీడియా ద్వారా ప్రయాణికులకు మరింత చేరువ కావాలని ఆర్టీసీ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. వేర్వేరు స్థాయి అధికారులు వినియోగించే ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ఖాతాల్లో సమాచారం అప్‌డేట్ అయ్యేలా చూస్తున్నారు. ఇందుకోసం ఆయా స్థాయిల్లో ప్రత్యేకంగా అవగాహన, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని బస్‌భవన్ అధికారులు నిర్ణయించారు.

# వాట్సప్‌కు వచ్చిన లింక్‌ను ఓపెన్ చేసిన వ్యక్తికి ఊహించని షాక్




కామారెడ్డి, నవంబరు20(సందేశం టైమ్స్):ఈ మధ్య కాలంలో సైబర్ మోసాలు పెరిగిపోతున్నాయి. మాయ మాటలతో ప్రజలను సైబర్ కేటుగాళ్లు ఈజీగా మోసం చేస్తున్నారు. వాళ్ల వలకు చిక్కి ఎంతో మంది పెద్ద మొత్తం డబ్బులు పోగొట్టుకుంటున్న పరిస్థితి. సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీసులు అనేక చర్యలు తీసుకుంటున్నారు. సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ ఏదో విధంగా సైబర్ కేటుగాళ్ల వలలో అమాయక ప్రజలు చిక్కుతూనే ఉన్నారు.. లక్షల్లో నగదును పోగొట్టుకుంటూనే ఉన్నారు. తాజాగా కామారెడ్డి జిల్లాలో ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. ఒక్క క్లిక్‌తో బాధితుడు లక్షల్లో మోసపోయాడు. ఇంతకీ ఏం జరిగిందో చూద్దాం.జిల్లాలోని బీబీపేటలో సైబర్ మోసం జరిగింది. వాట్సప్‌కు వచ్చిన లింకులను ఓ వ్యక్తి ఓపెన్ చేశాడు. ఈ క్రమంలో దాదాపు రూ. 6 లక్షల నగదను కోల్పోవాల్సి వచ్చింది. సదరు వ్యక్తి నుంచి భారీ నగదును సైబర్ మోసగాళ్లు లాక్కున్నారు. బాధితుడికి కొద్ది రోజుల క్రితం అమెజాన్ నుంచి వచ్చినట్టుగా ఓ లింక్‌ను సైబర్ నేరగాళ్లు పంపారు. లింక్‌ను ఓపెన్ చేసి టాస్క్‌లను పూర్తి చేస్తే రూ.5.49 లక్షలు లాభం వస్తాయని కేటుగాళ్లు నమ్మబలికారు. పెద్ద మొత్తంలో డబ్బులు వస్తాయని ఆశపడిన ఆ వ్యక్తి ఉన్న సొమ్ము పోతుందని ఊహించలేకపోయాడు. సైబర్ మోసగాళ్లు చెప్పిన విధంగా లింక్‌లు ఓపెన్ చేసి టాస్క్‌లు పూర్తి చేసే పనిలో పడ్డాడు. ఇలా విడతల వారీగా సుమారు రూ.6 లక్షల నగదును బాధితుడు పంపించాడు.చివరకు అదనంగా డబ్బులు రాకపోగా.. ఉన్నది కూడా పోగొట్టుకోవడంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడిన ఫిర్యాదు మేరకు బీబీపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సైబర్ మోసగాళ్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని.. ఫోన్లకు వచ్చిన లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని... మోసపోవద్దని పోలీసులు సూచించారు.

# తెరపైకి కొత్త 'బొమ్మ'లు.. వెలుగులోకి మరిన్ని పైరసీ ముఠాలు




- చెలరేగిపోతున్న సైబర్ నేరగాళ్లు
- విదేశీ ఐపీఅడ్రస్ లతో వెబ్‌సైట్లు
- అతిపెద్ద ముప్పుగా క్యామ్ రికార్డింగ్
- 500 సినిమాలు పైరసీ చేసిన అశ్వనీకుమార్
- 2000 సినిమాలతో ఐ బొమ్మ రవి రికార్డు
- పైరసీలతో ఇండస్ట్రీకి రూ.వేల కోట్ల నష్టం

హైదరాబాద్ సిటీ:నవంబరు20(సందేశం టైమ్స్): కాపీ రైట్ రక్షణ పొందిన సినిమాలను పైరసీ చేసి.. డిజిటల్ మీడియాను హ్యాక్ చేసి వివిధ వెబ్‌సైట్ల ద్వారా వాటిని పంపిణీ చేస్తూ సినిమా ఇండస్ట్రీకి రూ.వేల కోట్ల నష్టాన్ని కలిగిస్తున్న ముఠాల ఆట కటిస్తున్నారు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు. నెల రోజుల క్రితం బిహార్)కు చెందిన అశ్వనికుమార్ ముఠాలోని ఐదుగురిని అరెస్టు చేశారు. తాజాగా ఐ బొమ్మ పేరుతో సినిమా పైరసీకి పాల్పడుతున్న ఇమ్మడి రవిని పోలీసులు అరెస్టు చేశారు. మరిన్ని కొత్త ముఠాలు ఉన్నాయని విచారణలో పోలీసులు గుర్తిస్తున్నారు. వాటిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.అశ్వనీకుమార్ ముఠాలో బిహార్‌కు చెందిన అర్సలాన్ అహ్మద్, తమిళనాడుకు చెందిన సిరిల్ ఇన్సంట్‌రాజ్, సుధాకరణ్, ఏపీకి అమలాపురానికి చెందిన జాన్ కిరణ్‌కుమార్ ఉన్నారు. ఈ ముఠా సభ్యులు 2020 నుంచి ఇప్పటి వరకు టాలీవుడ్‌తో పాటు..దేశవాప్తంగా వివిధ భాషలకు చెందిన సుమారు 500 చిత్రాలను పైరసీ చేశారు. లక్ష డాలర్ల వరకు (రూ. 90 లక్షలు) సంపాదించినట్లు పోలీసుల విచారణలో తేలింది. దేశంలోని వివిధ ఇండస్ట్రీలకు కలిపి మొత్త రూ. 22,400 కోట్లు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు.ఒక్క తెలుగు ఇండస్ట్రీకే రూ.3,700 కోట్లు నష్టం వాటిల్లినట్లు లెక్కలు తేల్చారు. నిందితులు పైరసీ చేసిన సినిమాల్లో హిట్, ది థర్డ్‌కేస్, సింగిల్, కుబేరా, హరి హర వీరమల్లు ఉన్నాయన్నారు. ఒక్క హైదరాబాద్‌లోనే 100 సినిమాల వరకు రికార్డు చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. అశ్వనీకుమార్ హ్యాకింగ్ నిపుణుడుగా పోలీసులు గుర్తించారు. 1ఎక్స్‌బెట్, 4రాబెట్, రాజ్‌బెట్, పరిమాటెక్ వంటి బెట్టింగ్, గేమింగ్, టెలీగ్రామ్ చానళ్ల ద్వారా పైరసీ కాపీలను విడుదల చేసేవాడు.తాజాగా అరెస్టయిన ఇమ్మడి రవి.. ఐ బొమ్మ పేరుతో సుమారు 2వేల సినిమాలు తన వెబ్‌సైట్లో చేర్చినట్లు పోలీసులు గుర్తించారు. కొంతకాలంగా ఇతర దేశాల్లో ఉంటున్న రవి.. సినిమా పైరసీకి పాల్పడుతూ రూ.కోట్లు గడించాడు. సుమారు 50లక్షల మంది డేటాను సేకరించిన ఆయన ఇండస్ట్రీకి వేల కోట్ల నష్టానికి కారణమైనట్లు పోలీసులు గుర్తించారు. కేవలం అశ్వనికుమార్, ఇమ్మడి రవి ముఠాలే కాకుండా మరికొన్ని ఉన్నాయన్న సమాచారంతో దర్యాప్తు చేస్తున్నారు. ఐపీ అడ్రస్ లొకేషన్లను నెదర్లాండ్స్, పారిస్ వంటి దేశాలకు మారుస్తూ దందా చేస్తున్న కొత్త ముఠాలను కూడా పట్టుకునేందుకు పోలీసులు కసరత్తు చేస్తున్నారు. సినిమా ఇండస్ట్రీకి క్యామ్ రికార్డింగ్ అతిపెద్ద ముప్పు అని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. హోస్టింగ్ కంపెనీలు, ఐఎసపీలు, డిజిటల్ పైరసీకి పాల్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

# నేటి నుంచి ఓటర్ల జాబితాసవరణ




హైదరాబాద్,నవంబరు20(సందేశం టైమ్స్):పంచాయతీ ఎన్నికల సమరానికి ఈ నెలలోనే షెడ్యూల్ జారీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నెల 26న షెడ్యూలు విడుదల కానున్నట్లు తెలుస్తోంది. అనంతరం నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల ప్రక్రియ పూర్తయి డిసెంబరు రెండో వారంలో పోలింగ్ జరుగుతుందని అంచనా. దీనికి అనుగుణంగానే రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కసరత్తు ప్రారంభించింది. పంచాయతీలు, వార్డుల వారీగా ఓటరు జాబితాను మరోసారి సవరించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇందుకుగాను గురువారం (ఈ నెల 20) నుంచి 23 వరకు గ్రామాల్లో ఓటరు జాబితాల సవరణ కోసం షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాల ప్రకారం.. గతంలో వెల్లడించిన జాబితాలో నమోదు కాకుండా ఇటీవల కొత్తగా వచ్చిన దరఖాస్తుల పరిశీలన, ఇదివరకు ఉన్నవాటిలో తప్పుల సవరణ, అభ్యంతరాల స్వీకరణను గురువారం చేపట్టనున్నారు. 21న ఓటరు దరఖాస్తులు, అభ్యంతరాల పరిష్కారం చేపట్టి.. 23న పంచాయతీ, వార్డుల వారీగా తుది ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రచురణ చేపట్టనున్నట్లు ఎస్ఈసీ ఉత్తర్వుల్లో పేర్కొంది. మరోవైపు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, జిల్లా ఎస్పీలతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఎన్నికల నేపథ్యంలో స్థానిక పరిస్థితులు, ఎన్నికల సంసిద్ధత, నిర్వహణ కోసం ఏర్పాట్లు వంటి అంశాలపై వారితో చర్చించనున్నారు. దీంతోపాటు తుది ఓటరు జాబితా తయారీ షెడ్యూల్, పోలింగ్ సిబ్బంది, పోలింగ్ కేంద్రాలు, సామగ్రి, జోనల్ అధికారులు, పరిశీలకులు, శాంతిభద్రతలు, సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు, మోడల్ కోడ్ కమిటీ, ఎన్నికల నిర్వహణకు మార్గదర్శకాల రూపకల్పన వంటి అంశాలపైనా చర్చించి నిర్ణయం తీసుకుంటారు.

(Sandesham Times) TG TEL/25/A0348“Title: Sandesham Times“Address: 3-82, Ananthagiri, Singavaram, Suryapet, Telangana – 508 206“Email:sandeshamtimes@gmail.com | Website: https://sandeshamtimes.com. Publisher & Printer: Amrutha Venkat Media Publication Private Limited,“3-82, Singaram, Ananthagiri Mandal, Suryapet District, Telangana – 508206“ Phone: 9052045435.“Printed at: Sunday Printing Press,“3-4297, Saraswathi Complex, SVN Colony, Guntur, Andhra Pradesh – 522 006